క్లుప్తంగా

నీటిసంఘం అధ్యక్షుడు బాధ్యతల స్వీకరణ



సాగునీటి సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గారపాటి

ఆలమూరు: చింతలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాస చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆలమూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో జేఈ టి.కృష్ణ త్రిమూర్తులు చేతుల మీదుగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సాగునీటి సంఘ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా పంచామృత అభిషేకం

మలికిపురం: స్థానిక ఎత్తు వంతెన వద్ద ఉన్న హరిహరసుత అయ్యప్ప స్వామి వారి ఆలయం వద్ద అయ్యప్ప స్వామికి బుధవారం పంచామృత అభిషేకం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం, ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు శ్రీనివాస్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్య అన్నదాన ట్రస్టుకు కాకినాడ జిల్లా తూరంగికి చెందిన నూజిల్ల శ్రీనివాస్ బుధవారం రూ.10 వేలు విరాళంగా సమర్పించారు. ఈ విరాళాన్ని ఆలయ అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్‌కు అందజేశారు. విరాళం అందించిన శ్రీనివాస్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కాగా బుధవారం స్వామి వారికి వివిధ సేవల ద్వారా 89,868 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 1500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 600 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.26,362 విరాళాలుగా అందించారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత తరుణ్ కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మలికిపురం మండలం అంతర్వేదికి చెందిన పోతురాజు తరుణ్ నాగ సూర్య వెంకట సత్యనారాయణ, జశ్విత్ సూర్య పవన్ కుటుంబ సభ్యులు రూ.10,001లు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

చిన్నారులకు టీకాలు



ఆలమూరులో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ వ్యాక్సిన్లు వేశారు.

సమస్యలతో సతమతం

- సంక్షోభంలో చేనేత రంగం
- సొసైటీల్లో పెరిగిపోయిన వస్త్ర నిల్వలు



అప్పనపల్లిలో చేనేత పనులు చేస్తున్న కార్మికులు

మామిడికుదురు: చేనేత రంగం పలు సమస్యలతో సతమతమవుతుంది. ఈ రంగాన్ని పలు సమస్యలు వేధిస్తున్నాయి. సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు తీవ్రంగా మండిపడుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి, రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో వేలాది మంది చేనేత రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చేనేత సొసైటీల్లో చేనేత వస్త్రాల నిల్వలు పెరిగిపోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేనేత కార్మికులకు పెద్దగా పనులు లేక కార్మికులు ఇతర రంగాల వైపు వెళ్లిపోతున్నారు.

సమస్యలు ఇవీ..

సొసైటీలకు నూలుపై 20 శాతం సబ్సిడీ ఇవ్వాలని, దీన్ని ప్రతి నెలా కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ రాయితీ ఇస్తామని ప్రభుత్వం చెప్పినా కార్మికులకు గుర్తింపు కార్డులు లేక ఆ రాయితీ కొంత మందికే పరిమితమైందని వాపోతున్నారు. ప్రతి కార్మికుడికి తక్షణం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్ ఇన్సూరెన్సు సదుపాయం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. సొసైటీల్లో నిల్వ ఉన్న సరకును ఆప్కో ద్వారా తక్షణం కొనుగోలు చేయాల్సి ఉంది. ఆప్కో ద్వారా సొసైటీలకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు. వీటితో పాటు కార్మికులకు సబ్సిడీ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

చేనేతను ఆదుకోవాలి



జగ్గన్నపేట చేనేత సొసైటీ పరిధిలో 800 కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుతం నూలు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ విధించి చేనేతను నడ్డి విరిచింది. గత ప్రభుత్వం రూ.24 వేలు నేతన్న నేస్తం ఇచ్చి కార్మికులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం కూడా చేనేత కార్మికులకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి. చేనేత కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రుణాలు అందించాలి.

– బళ్ల సత్యనారాయణ, మాజీ చైర్‌పర్సన్, జగ్గన్నపేట చేనేత సొసైటీ

చేనేత కార్మికులను ఆదుకోవాలి



చేనేత రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. చేనేత కార్మికులు నేడు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేనేత రంగాన్ని ఎంతో ప్రోత్సహించారు. ఆయన ఇచ్చిన రాయతీలన్నీ అమలు చేయాలి. నూలు, రసాయనాలపై సబ్సిడీని ప్రకటించాలి. చేనేత కార్పొరేషన్‌ను వెంటనే ప్రకటించాలి. చేనేత సొసైటీలకు ఎన్నికలు జరిపించాలి.

– పిచ్చుక శివనాగ సత్యనారాయణ, మాజీ సర్పంచ్, అప్పనపల్లి

దళితులపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం

జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి ధ్వజం



గోపాలపురంలో జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలసిన రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి కిషోర్ తదితరులు

రావులపాలెం: దళిత వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందుతున్నాయని ఉద్దేశంతో రాజకీయంగా ఎదుగుతున్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్ తదితర నాయకులు జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని బుధవారం మండలంలోని గోపాలపురంలో ఆయన నివాసంలో కలిశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపైన, సోషల్ మీడియా ప్రతినిధులపైన లేనిపోని అక్రమ కేసులు పెట్టి జైల్లో బంధించి ఆనందపడుతున్నారని, ఈ ఆనందం ఎంతకాలమో ఉండదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని మరచి కేవలం కక్ష సాధింపులకు దిగుతుందని, దళితుల్లో ఎదుగుతున్న నందిగం సురేష్ పైన మిగిలిన దళిత నాయకులపై తప్పుడు కేసులు పెట్టి హింసిస్తూ శునకానందం పొందుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ బాధితులకు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తాము కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇకనైనా కక్ష సాధింపులకు స్వస్తి చెప్పి ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని హితవు పలికారు. 10 నెలలుగా లక్షా 75 వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకున్న ఈ కూటమి ప్రభుత్వం ఈ షెడ్యూల్ కులాలు, బలహీన వర్గాల ప్రాంతాల్లో ఏమీ అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మరో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నా ఇప్పటి వరకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేదని, అదే విధంగా రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పళ్లాలమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్



వానపల్లి పళ్లాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ వారిని మాజీ శాసనమండలి మాజీ సభ్యుడు, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ దర్శించుకున్నారు. ఇటీవల భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంలో విజయం సాధించిన భారత సైనికులకు దైవ బలం కల్పించేందుకు ఆలయాల్లో పూజలు నిర్వహించడంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ బుధవారం పళ్లాలమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పాకిస్తాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రతి సైనికుడికి ఆయురారోగ్యాలు కలగజేయాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా బీజేపీ కార్యదర్శి గోల కోటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీజేపీ యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నూకల వీరన్న, కంచుస్తంభం శ్రీనివాసరావు, బల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలను నిర్వీర్యం చేయడం తగదు



దొమ్మేటి సత్యమోహన్

అంబాజీపేట: నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు నేరుగా ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం తగదని జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. టీడీపీ కూటమి సర్కారు ఇప్పటికే రేషన్ డోర్ డెలవరీ వ్యవస్థను నీరుగార్చగా, తాజాగా పూర్తిగా ఎత్తివేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. రాజకీయ దురుద్దేశాలతో ఏకపక్షంగా ఎండీయూ వ్యవస్థను తొలగించడం కూటమి ప్రభుత్వం కక్షపూరితమేనన్నారు. సొంత మండలాల్లోని నిరుద్యోగులను ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పించేందుకు ఎండీయూ వాహనాలను తీసుకువచ్చి వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత నిర్ణయం కారణంగా ఎండీయూ వాహనదారులు రోడ్డున పడతారని వారికి సరైన అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని సత్యమోహన్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు భృతి, ఉద్యోగ అవకాశాలు ఇస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి మాట తప్పిందని విమర్శించారు. నూతనంగా నియమితులైన పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి రాకతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

బాపు–రమణ అవార్డు అందుకున్న వినోద్

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన టీచర్, ప్రముఖ కార్టూనిస్ట్ వినోద్ బాపు–రమణ అవార్డును మంగళవారం హైదరాబాదులో రవీంద్రభారతిలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. వివరాలను ఆయన బుధవారం మీడియాకు తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సత్కళాభారతి, హాస్యానందం సంస్థ సంయుక్తంగా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం ఏర్పాటు చేశారు. దినోత్సవం పురస్కరించుకుని తెలుగు సంస్కృతిక సంప్రదాయం ప్రతిబింబింపచేసే విధంగా వినోద్ గీసిన కార్టూన్ (ఆ ఓణీ అమ్మాయి అమెరికా నుంచి వచ్చిందట, చిత్రంగా లేదూ అంటూ ఆశ్చర్యానికి లోనయ్యే విధంగా) బాపు–రమణ అవార్డుకు అర్హత సాధించింది. ఈ మేరకు ప్రముఖ సినీనటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ళ భరణి, బాపు–రమణ అవార్డు కమిటీ ప్రతినిధి సుబ్బరాజు చేతుల మీదుగా వినోద్ పై అవార్డు తీసుకున్నారు. అవార్డు అందుకున్న వినోద్‌ను సహచర ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందించారు.

పంట కాలువలకు మోక్షం

ఆలమూరు: దీర్ఘకాలంగా వ్యర్థాల చెరలో ఉన్న పంట కాలువలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఖరీఫ్‌కు సక్రమంగా సాగునీరు అందించాలన్న ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఎ.రాజు, చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస చౌదరి, సర్పంచ్ నేలపూడి లావణ్య స్పందించారు. దీంతో పంచాయతీరాజ్ నిధులతో స్థానిక మార్కెట్ మలుపు నుంచి అగ్నికుల క్షత్రియపేట వరకూ, అలాగే వెదురుమూడి కొత్త కాలువ పరిధిలోని బోణువు చెరువు వాటర్ ట్యాంక్ సమీపం నుంచి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వరకూ పంటకాలువను యంత్రాలతో శుభ్రం చేశారు. చెత్త, వ్యర్థాలను తొలగించి సాగునీరు పారేందుకు వీలు కల్పించారు. స్థానికులెవరూ దయచేసి వ్యర్థాలను పంట కాలువల్లో వేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. వ్యర్థాలతో నిండిన పంట కాలువకు ఆధునీకరిస్తున్న ఎంపీడీఓ రాజు, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటిని అభినందించారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులను రైతులు అభినందించారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొత్తపేటకి చెందిన వులుసు వల్లి పద్మశ్రీ (50) కామెర్లు వచ్చి శరీరంలో తెల్ల రక్తకణాలు బాగా పెరిగిపోయాయి. కొత్తపేటలో కొంత వరకు వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేయించడానికి ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో పేషెంట్ భర్త సుబ్బారావుకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11,500 చెక్కు అందజేశారు.

సఖినేటిపల్లిలో తిరంగా యాత్ర

సఖినేటిపల్లి: ఆపరేషన్ సిందూర్ విజయవంతమవడంతో త్రివిధ దళాలకు సంఘీభావంగా సఖినేటిపల్లి సెంటర్లో బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్ నేతృత్వంలో సఖినేటిపల్లి సెంటర్ నుంచి స్టేట్‌బ్యాంకు వీధి మీదుగా త్రివర్ణ పతాకాలతో ప్రధాన కూడలిలో ఈ యాత్ర సాగింది. భారత్‌మాతాకీ జై, జై జవాన్, జైజై జవాన్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివ రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి బోణం నాయుడు, నాయకులు ఇందుకూరి సుబ్బరాజు, కాళ్ళకూరి సతీష్, మల్లాడి స్వామి, భీమనాథం సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ మూలమంత్ర హోమం



సీతారామచంద్రస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో సీతారామచంద్రస్వామికి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు అయిన బుధవారం స్వామికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజలు జరిపారు. అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆవాహనం, శ్రీలక్ష్మీనారాయణ మూలమంత్ర హోమం, పాయస హోమం, వర్షవర్ధన దైవత్య ప్రధాన హోమం, శాంతి హోమం వంటి విశేషపూజలు జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. కోలాటం నిర్వహించారు. సాయంత్రం విష్ణు దైవత్వ శ్రీ భూదైవత్య ప్రధానం హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆఖరి రోజైన గురువారం స్వామికి మహాపట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్ప ఆలయంలో మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దాత వరప్రసాద్ దంపతులు

అమలాపురం రూరల్: కోనసీమ మహాశాస్త అయ్యప్ప స్వామి ఆలయం 18వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, దుర్గా నవ గ్రహ హోమాలు, మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఆలయంలో మేధాదక్షిణామూర్తి విగ్రహాన్ని పల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహ దాత చాగంటి వరప్రసాద్ దంపతులు ప్రతిష్ఠించారు. వేలాది మందికి భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆలయ కమిటీ సభ్యుడు మోరంపూడి నాగేంద్ర, నాయకులు దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు, కోనా వెంకట్రాజును ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని సావరం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబాజీపేటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇద్దరు యువకులు గాయపడినట్టు బుధవారం అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. బాధిత యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరానికి చెందిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అమలాపురంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై అంబాజీపేట వైపునకు వెళుతున్న కొర్లపాటి లక్ష్మణ సాయి, చిక్కం గోపిని లారీ ఢీకొట్టింది. గాయాలపాలైన బాధిత యువకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజీపీగా జీపీ నాయుడు



కొత్తపేట: ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా కొత్తపేటకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది గాలిదేవర పుల్లయ్యనాయుడు నియమితులయ్యారు. ఆ మేరకు ఏపీ లా సెక్రటరీ జి.ప్రతిభాదేవి నుంచి ఉత్తర్వులు అందినట్టు నాయుడు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. కొత్తపేట సివిల్ జడ్జెస్ (సీనియర్ అండ్ జూనియర్ డివిజన్) కోర్టు ఏజీపీగా ప్రభుత్వం తరఫున అన్ని సివిల్ దావాలకు న్యాయవాదిగా పనిచేస్తారు. 2005 నుంచి 2012 వరకూ, 2015 నుంచి 2019 వరకూ పనిచేసిన నాయుడు తిరిగి ఏజీపీగా నియమితులయ్యారు. ఆయన మూడు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగుతారు.

వివిధ సమస్యలతో వ్యక్తి మృతి



రంకిరెడ్డి సింహాద్రి (ఫైల్)

అంబాజీపేట: వివిధ సమస్యల కారణంగా మనస్థాపానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేటకు చెందిన రంకిరెడ్డి సింహాద్రి (40) ఈ నెల 20న మొసలపల్లి శివారు కొబ్బరితోటల్లో పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తె కీర్తి, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు ముస్తాబు

అమలాపురం టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా యువతకు సనాతన ధర్మంపై మరింత అవగాహన పెంచేందుకు గురువారం విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్ దళ్ సంయుక్తంగా అమలాపురం పట్టణంలో నిర్వహించే విజయోత్సవ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) కోసం పట్టణం ముస్తాబైంది. పట్టణంలో ఏ రోడ్డు చూసినా కాషాయ జెండాలతో అమలాపురం రెపరెపలాడుతోంది. శోభాయాత్ర ప్రారంభమయ్యే స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో 216 జాతీయ రహదారి చెంతనున్న త్రిముఖ గణపతి ఆలయం నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్డు అంతటా కాషాయ జెండాలను తోరణాలుగా కట్టి సరికొత్త శోభను తెచ్చారు. హైస్కూలు సెంటర్, గడియారం స్తంభం, ముమ్మిడివరం గేటు సెంటర్, నల్లవంతెన రోడ్డు, ఎర్ర వంతెన రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టేషన్ రోడ్డు, కొంకాపల్లి కూడలి వరకు కాషాయ జెండాలను అలంకరించారు. పట్టణంలో ఉన్న దేవస్థానాలు, ఆలయాలను కాషాయ జెండాలతో అలంకరించారు. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ప్రతినిధులు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, రాళ్లపల్లి పాపయ్య శర్మ, శిరంగు నాయుడు, కాళ్లకూరి కుమార్, ఊటుకూరి సాంబయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. త్రిముఖ గణపతి ఆలయం నుంచి మొదలయ్యే శోభాయాత్ర పుర వీధుల్లో హనుమాన్ నామస్మరణతో, హిందూ ధర్మ ప్రచారంతో, సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తూ సాగనుందని నిర్వాహకులు తెలిపారు.

అధిక లోడు.. అనర్థం

- ఊక లారీలతో ట్రాఫిక్ జామ్
- నిబంధనలకు తిలోదకాలు
- అధికారుల స్పందన అంతంతే



ఆలమూరు–మండపేట రహదారిలో ప్రయాణిస్తున్న ఊక లారీ

ఆలమూరు: వాహనాల రద్దీ, ఇరుకు రోడ్లతో సతమతమవున్న ప్రజానీకానికి భారీ లోడుతో వెళుతున్న ఊక లారీలు అనునిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఊక, బూడిద రవాణా చేస్తున్న లారీలకు ఇరువైపులా మీటరు మేర వెడల్పుగాను, ఉబ్బెత్తుగా సరకు నింపడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రయాణికులకు కనిపించడం లేదు. సుదీర్ఘ సమయం ప్రయాణించిన తరువాత ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే అధిక లోడుతో వెళుతున్న వాహనాన్ని అధిగమించ వలసిన పరిస్థితి. నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక టన్నులతో ప్రతి రోజు ఉదయం వేళల్లో పదుల సంఖ్యలో లారీలు మండపేట వైపు, వెదురుమూడి వైపు ప్రయాణించడం వల్ల వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై ఊక లారీలు స్వారీ చేయడం వల్ల సాఫీగా ప్రయాణించడం ప్రాణసంకటంగా మారింది. ఒక్కోసారి లారీలకు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే రోడ్డు మీదనే నిలిచిపోవడం ప్రయాణికులు శాపంగా పరిణమిస్తుంది. అధిక లోడును నివారించినవలసిన ఆర్టీవో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కాలం చెల్లిన వాహనాలు రోడ్డులపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చనే అభిప్రాయం పర్యావరణవేత్తల నుంచి వ్యక్తమవుతుంది. అధిక లోడు ప్రయాణం నివారిస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం సులభం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఊక, బూడిద లారీ యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. అలాగే జొన్నాడ–మండపేటతో పాటు కొత్తూరు–వెదురుమూడి రోడ్లలోని అసంపూర్తిగా ఉన్న బెర్మ్‌లకు మరమ్మతులు చేస్తే మరింత ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



పరిమితికి మించి లోడు వేసుకుని ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు డ్రైవర్లకు అధిక లోడు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాం. ఊక, బూడిద తరలించే వాహనదారులు తప్పనిసరిగా పట్టాలు ఏర్పాటు చేసుకుని ప్రయాణికులకు అంతరాయం కలగకుండా చూడాలి.

– ఎం.అశోక్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఆలమూరు